

రాంనరేష్‌నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

రాంనరేష్‌నగర్‌లో

డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

హైదర్‌నగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాంనరేష్‌నగర్ కాలనీలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో సమస్యలు పరిష్కరించాలని, అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, జీహెచ్ఎంసీ ఏఈ రాజీవ్, జలమండలి డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సుదర్శన్‌నగర్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10.30 నుంచి 5గంటలకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని అధికారులు తెలిపారు. సుదర్శన్‌నగర్, భాగ్యలక్ష్మికాలనీ, డోయన్స్‌కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : జడ్‌సీ



జేపీనగర్‌లో పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతున్న జడ్‌సీ స్నేహ శబరీష్

చందానగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ అన్నారు. చందానగర్, హఫీజ్‌పేట, మాదాపూర్ డివిజన్లలో బుధవారం తెల్లవారుజామున పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా క్యూఆర్‌కోడ్ ద్వారా ఆమె స్వచ్ఛ ఆటోల హాజరు తీసుకునే విధానాన్ని పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మాదాపూర్ హైటెక్‌సిటీ రోడ్డులో ఏర్పాటు చేసిన భవన నిర్మాణాల నిల్వ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చందానగర్ ఉపకమిషనర్ వంశీకృష్ణ, ఏఎంహెచ్‌వో కార్తీక్, శానిటేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్ ఎస్టేట్స్‌లో సీతారాముల అక్షింతల పంపిణీ

మియాపూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్ ఎస్టేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అయోధ్య సీతారామ చంద్రుల అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేశారు. టీటీడీ ఎస్వీబీసీ చానల్ అడ్వైజర్ ఏఎస్ దుర్గారావు, అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డీఎస్‌ఆర్‌కే ప్రసాద్, గంగాధరశాస్త్రి, సత్యనారాయణ, కె. ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీయాలి



బహుమతి అందుకుంటున్న అఖిల్

జీడిమెట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలుగులోకి తీసుకురావడానికి పాఠశాలలు కృషి చేయాలని చెస్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరావు అన్నారు. ప్రగతినగర్ చెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టేట్ ఓపెన్ ప్రైజ్ మనీ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు.

అండర్ 7, 9, 11, 13 సంవత్సరాల విభాగాల్లో పోటీలు జరిగాయి. జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్‌కు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాలలో యూకేజీ చదువుతున్న దార అఖిల్ అండర్-9 విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు.

సర్వీస్ రోడ్డులో వీధి వ్యాపారాలు తొలగింపు

పేట్‌బషీరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్-44 రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డులో సుచిత్ర నుంచి కొంపల్లి వరకు ఉన్న వీధి వ్యాపారుల గుడెసెలు, డబ్బాలను మంగళవారం తొలగించారు. దీంతో బుధవారం 70 మంది వీధి వ్యాపారులు అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ కార్యాలయానికి వెళ్లి వ్యాపారాలు చేసుకోవడానికి అనుమతించాలని ప్రాధేయపడ్డారు. రహదారికి ఇరువైపుల వ్యాపారాలు నిర్వహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని ఏసీపీ వెంకట్‌రెడ్డి తెలిపారు. రహదారి విస్తరిస్తున్నారని, పనులతో వాహనాలను దారి మళ్లిస్తున్నామన్నారు. సర్వీస్ రోడ్డులో వ్యాపారాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

22 వరకు ఓటరు నమోదు

కూకట్‌పల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదు అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కూకట్‌పల్లి నియోజకవర్గ ఎన్నికల అధికారి, మూసాపేట సర్కిల్ ఉపకమిషనర్ రమేష్ అన్నారు. ఈనెల 6 నుంచి 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. కొత్తగా ఓటరుగా నమోదు, చిరునామా మార్పు, పేర్ల నమోదులో తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈనెల 21, 22 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని, వచ్చేనెల 8వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

● కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్

కూకట్‌పల్లి/ఫతేనగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. బాలానగర్ ఇందిరాగాంధీపురానికి చెందిన మహ్మద్ గౌస్ ఆధ్వర్యంలో 20 మంది స్థానికులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇందిరాగాంధీపురంలో జరిగిన కాలనీ ఎన్నికల్లో విజయం సాధించిన యూసుఫ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విడుదల చేసే రూ. 10 కోట్ల నిధులతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. నాయకులు నవాబు, పప్పు, ఇజాజ్ తదితరులు పాల్గొన్నారు.

● ఓటరు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు బండి రమేష్ సూచించారు. డివిజన్ల వారీగా కాలనీల్లో ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు.

దుండిగల్ సీఐగా సీహెచ్ శంకరయ్య



దుండిగల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ సీఐగా సీహెచ్ శంకరయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సీఐ వై. రామకృష్ణ బదిలీ కావడంతో ఆయన స్థానంలో మేడ్చల్ సీసీఎస్‌లో పనిచేసిన శంకరయ్యను సీఐగా నియమించారు.

రేపు రక్తదాన శిబిరం

పేట్‌బషీరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద 161వ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 12 తేదీన రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ కమ్యూనిటీ హాల్లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. కీళ్ల, దంత, షుగర్ పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

భవానీపురంలో ముగ్గుల పోటీలు

చందానగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): భవానీపురంలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గణేష్‌మండపం వద్ద నిర్వహించిన పోటీల్లో పలువురు మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, సభ్యులు మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు.

బీఎన్ఎస్ చట్టం రద్దు చేయాలి : సీఐటీయూ

బాలానగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భారత న్యాయ సహిత (బీఎన్ఎస్)చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు, ట్రక్, ప్రైవేట్, బస్ డ్రైవర్లు డిమాండ్ చేస్తూ బాలానగర్‌లో నర్సాపూర్ చౌరస్తా వద్ద బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్లకు పదేళ్ల జైలుశిక్ష, రూ.7 లక్షల నష్టపరిహారం ఇచ్చేలా చట్టం తీసుకొచ్చి డ్రైవర్లు, వారి కుటుంబాలను రోడ్డున పడేసే కుట్ర చేస్తోందన్నారు. శిక్షలతోనే ప్రమాదాలు తప్పుతాయనే ఆలోచన ఉంటే కేంద్ర ప్రభుత్వం మొదట గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.

చట్టాన్ని రద్దు చేయకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ రాష్ట్ర నాయకులు బసగాని ఉమేష్‌రెడ్డి, డ్రైవర్స్ యూనియన్ నాయకులు విష్ణు, మోసిన్, నరేష్, సత్యం ముదిరాజ్, భాస్కర్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, ట్రక్కు ప్రైవేటు బస్ డ్రైవర్లు



సత్యాగ్రహ దీక్షలో ప్రొఫెసర్ హరగోపాల్, విద్యార్థులు తదితరులు

కులగణన చేపట్టాలని సత్యాగ్రహ దీక్ష

రాయదుర్గం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఓబీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మెయిన్‌గేటు వద్ద బుధవారం సత్యాగ్రహ దీక్ష చేశారు.

సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఏఐఓబీసీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, అధికార పక్షం, ప్రత్యేక సంఘాలు చేసే తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. దేశంలో అతిపెద్ద సమూహం ఓబీసీ సామాజిక ఆర్థిక, విద్యా స్థితిపై సరైన డాటా లేకపోవడం వల్ల అవసరమైన సంక్షేమ కార్యక్రమాలు లేవంటూ ప్రొఫెసర్ హరగోపాల్ సత్యాగ్రహ దీక్షకు మద్దతు తెలిపారు.

విద్యార్థి నాయకులు కొండల్, సాయికిరణ్, మురళి, ముక్తి, లక్ష్మీనర్సయ్య, మల్లేశ్, మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

నిజాంపేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు ఊరెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలని సైబరాబాద్ డీసీపీ (క్రైమ్స్) కొత్తపల్లి నర్సింహ అన్నారు. బుధవారం బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ మాట్లాడారు. స్వగ్రామాలకు వెళ్లే వారు ఇంటి ప్రధాన ద్వారానికి సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని, బంగారం, విలువైన వస్తువులను బీరువాలు, దిండ్లు, పరుపుల కింద పెట్టొద్దని సూచించారు. కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100 లేదా సైబరాబాద్ వాట్సాప్ నెంబర్ 9490617444కు సమాచారం ఇవ్వాలన్నారు. సంక్రాంతి పండగ దృష్ట్యా చోరీల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా రాత్రి సమయాల్లో వీధుల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



ఆటో ద్వారా ప్రచారం చేస్తున్న పోలీసులు

రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

పేట్‌బషీరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. కొంపల్లి మున్సిపల్‌లో ఇండిక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏసీపీ వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్కూల్ బస్సుల డ్రైవర్లు వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలన్నారు. పరిమితికి మించి విద్యార్థులను స్కూల్ బస్సుల్లో తీసుకురావద్దన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రాక్రాసింగ్, హెల్మెట్, సెల్‌ఫోన్, ఓవర్‌స్పీడ్, జిగ్‌జాగ్ డ్రైవింగ్‌పై ప్రొజెక్టర్‌తో విద్యార్థులకు వివరించారు. అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగేశ్వరరావు స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

క్రీడలతో మానసికోల్లాసం

శామీర్‌పేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మనసికోల్లాసానికి, దేహదారుఢ్యానికి దోహదపడతాయని ఎంపీపీ ఎల్లుబాయి అన్నారు. బుధవారం శామీర్‌పేట మినీస్టేడియంలో మేడ్చల్ జిల్లా షెడ్యూల్డ్‌కులాల అభివృద్ధి శాఖ విద్యార్థులకు ఏర్పాటు చేసిన క్రీడోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎస్‌డీవో వినోద్‌కుమార్

బాలుర విభాగంలో విజేతలు

కబడ్డీ పోటీల్లో ఘట్‌కేసర్ ఎస్సీ హాస్టల్ బాలుర విద్యార్థులు ప్రథమ స్థానం, యాప్రాల్ ఎస్సీ హాస్టల్ బాలురు ద్వితీయ స్థానం సాధించారు. వాలీబాల్ పోటీల్లో మేడ్చల్ ఎస్సీ హాస్టల్ విద్యార్థులు మొదటి స్థానం, యాప్రాల్ హాస్టల్ విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. ఖోఖో పోటీల్లో యాప్రాల్ విద్యార్థులు మొదటి స్థానం, మేడ్చల్ హాస్టల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు.

బాలికల విభాగంలో..

కబడ్డీ పోటీల్లో దుండిగల్ హాస్టల్ బాలికలు ప్రథమ స్థానం, మేడ్చల్ హాస్టల్ బాలికలు ద్వితీయ స్థానంలో నిలిచారు. వాలీబాల్ పోటీల్లో దుండిగల్ బాలికలు ప్రథమ, మేడ్చల్ హాస్టల్ బాలికలు ద్వితీయ స్థానం సాధించారు. ఖోఖో పోటీల్లో ప్రథమ, ద్వితీయ విజేతలుగా దుండిగల్, మేడ్చల్ హాస్టళ్ల బాలికలు నిలిచారు. లాంగ్‌జంప్, షాట్‌పుట్, రన్నింగ్ పోటీలు కూడా నిర్వహించారు.

విజేతలకు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి వినోద్ కుమార్, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ బలరాం, సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధి సహాయ అధికారి శ్రీకర్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

రాష్ట్రంలో తొలిసారిగా 'కిమ్స్'లో స్మార్ట్‌వార్డు



స్మార్ట్‌వార్డు సిస్టం ప్రారంభోత్సవంలో ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, వైద్యులు

రాయదుర్గం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారిగా కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో స్మార్ట్‌వార్డు సిస్టంను డోజీ టెక్నాలజీ కంపెనీ భాగస్వామ్యంతో అందుబాటులోకి తీసుకొచ్చామని డాక్టర్ సుధీర్ తెలిపారు. ఈ టెక్నాలజీ సహకారంతో రోగుల సంరక్షణ మరింత సులువవుతుందన్నారు. ఎన్‌హ్యాండ్స్ సేఫ్టీ వింగ్ ప్రోగ్రామ్‌తో డోజీ టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కాంటాక్ట్‌లెస్ రిమోట్ పేషెంట్ మానిటరింగ్, ఎర్లీ వార్నింగ్ సిస్టమ్(ఈడబ్ల్యూఎస్) రోగి ఉన్న బెడ్‌కు అనుసంధానం చేయడం ద్వారా రోగి పల్స్, హార్ట్‌బీట్, శ్వాస ఎప్పటికప్పుడు ఈ టెక్నాలజీ ద్వారా గుర్తించి డాక్టర్లు, నర్సులకు ఎప్పటికప్పుడు అందజేస్తాయన్నారు. దీంతో పేషెంట్ పర్యవేక్షణ. భద్రత, క్లినికల్ ఫలితాలు మెరుగుపడతాయన్నారు. కిమ్స్ ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు మాట్లాడుతూ.. చికిత్సకు ఈ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. డోజి సంస్థ సీఈవో, సహవ్యవస్థాపకులు ముదిత్ దండువాటే మాట్లాడారు.

సీఐకి సన్మానం



సీఐని సన్మానించి మొక్క అందజేస్తున్న సీపీఐ నాయకులు

జీడిమెట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల సీఐగా బాధ్యతలు చేపట్టిన పి.శ్రీనివాసరావును సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటయూ నాయకులు బుధవారం సన్మానించారు. సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి ఉమామహేష్, సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు స్వామి, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పతంగుల తయారీలో శిక్షణ

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి నేపథ్యంలో మనకు నచ్చిన డిజైన్‌లో గాలిపటాలు తయారు చేసుకోవచ్చునని అంటోంది సింప్లీ నామ్‌ధారీ. ఇందుకోసం 5 నుంచి 12 సంవత్సరాల లోపు పిల్లల కోసం ఈనెల 13న బంజారాహిల్స్‌లో తమ స్టోర్‌లో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వర్క్‌షాప్‌లో గాలిపటాల తయారీలో శిక్షణ ఇవ్వడంతో పాటు బహుమతులు కూడా గెలుచుకునే అవకాశం ఉందన్నారు. వివరాలకు 63022 41108 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో

మతిస్థిమితం లేని ఇద్దరు మహిళల అదృశ్యం



దేవి



భాగ్య

జీడిమెట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో మతిస్థిమితం లేని ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. సుభాష్‌నగర్ గంపలబస్తీకి చెందిన విష్ణుచరణ్ కుమార్తె దేవి (35)కు మతిస్థిమితం లేదు. ఈనెల 2వ తేదీ ఉదయం 9.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాజులరామారం: సూరారం కృషి కాలనీలో రాచకొండ భాగ్య(60), భర్త చంద్రమౌళి, కుమారుడు మల్లేష్‌తో కలిసి నివసిస్తోంది. భాగ్యకు మతి స్థిమితం లేదు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గతంలో అనేకసార్లు ఇంటి నుంచి వెళ్లిపోయి కొద్ది రోజుల తర్వాత తిరిగి వచ్చేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుమారుడు మల్లేష్ సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చందానగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. బిహార్ రాష్ట్రానికి చెందిన మోఫి(50) జీవనోపాధి కోసం నగరానికి వచ్చి పాపిరెడ్డి కాలనీలో నివసిస్తూ కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం పనికోసం లేబర్ అడ్డా వద్దకు వెళ్లాడు. పక్కనే ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద అపస్మారకస్థితిలో పడిపోయి ఉన్నాడు. స్థానికులు చూసి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు మరో ఆస్పత్రికి తీసుకెళ్లమని చెప్పగా సిటిజన్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. వ్యక్తి మృతి

దుండిగల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. గండిమైసమ్మ చౌరస్తా రాజరాజేశ్వరి కాలనీలో నివసిస్తున్న మంగలి కృష్ణ(60) మంగళవారం రాత్రి బైక్‌పై ఓఆర్ఆర్ నుండి గండిమైసమ్మ వెళ్తున్నాడు. ఉజ్వల రెస్టారెంట్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓక్షితా ఎన్‌క్లేవ్‌లో కుంగిన రోడ్డు



కుంగిన రోడ్డు

గాజులరామారం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నాయకులు, కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాజులరామారం డివిజన్ ఓక్షిత ఎన్‌క్లేవ్‌లో మూడు నెలల క్రితం రూ. 43 లక్షల వ్యయంతో నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు పాడయ్యాయని కాలనీవాసులు బీజేపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు కాలనీలో కుంగిన రోడ్డును పరిశీలించారు. నాణ్యత లేకుండా రోడ్డును నిర్మించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుంగిన రోడ్డుకు మరమ్మతుల చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



పురస్కారం అందుకుంటున్న ఆచార్య ఎం.గోనానాయక్

ఆచార్య గోనానాయక్‌కు జీవిత సాఫల్య పురస్కారం

రాయదుర్గం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్‌యూనివర్సిటీలో తెలుగుశాఖ అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఆచార్య ఎం.గోనానాయక్‌కు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, భాషాభివృద్ధి ప్రాధికారిక సంస్థ తెలుగు భాషా సేవ జీవిత సాఫల్య పురస్కారం అందజేసింది. బుధవారం తెలుగుశాఖ అధ్యక్ష కార్యాలయంలో ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య పిల్లలమర్రి రాములు, ఆచార్య పవన్‌కుమార్, ఆచార్య డి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్‌గా ప్రదీప్‌కుమార్

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్‌గా ఎస్.వి.ప్రదీప్ కుమార్‌శెట్టి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత డైరెక్టర్ డాక్టర్ బి.ప్రభాకర్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. అర్బన్ ఫారెస్ట్ ఉద్యోగుల సహకారంతో హెచ్ఎండీఏ ప్రాముఖ్యతను పెంచేందుకు కృషి చేస్తానని ఎస్.వి.ప్రదీప్ కుమార్ శెట్టి తెలిపారు.

అయోధ్య రాములవారి వెండి పాదుకలకు ప్రత్యేక పూజలు

చాంద్రాయణగుట్ట/యాకుత్‌పురా, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా శృంగేరి పీఠం నుంచి శ్రీరామామృత తరంగిణి పేరిట 16 నదుల ఇసుక, పుణ్య తీర్థాలతో పాటు రాములోరికి సమర్పించే వెండి పాదుకలను లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదుకలకు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె.వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి బి.మారుతీ యాదవ్, ప్రచార కార్యదర్శి ఎ.వినోద్‌కుమార్, గడ్డం రవి స్వాగతం పలికారు. భక్తులు పాదుకలను దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.

కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ సి.రాజేందర్‌యాదవ్, మాజీ చైర్మన్లు కె.విష్ణుగౌడ్, సి.రాజ్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పాదుకలను తీసుకొస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు